నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 23 ఏప్రిల్ 2024 | SANGAREDDY

కొండాపూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

మెదక్‌లో ఎగిరేది గులాబీ జెండే..

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- కొండాపూర్ మండలంలోని మల్లేపల్లిలో ముఖ్య కార్యకర్తల సమావేశం

కొండాపూర్, ఏప్రిల్ 22: మెదక్ ఎంపీ ఎన్నికల్లో మరోసారి ఎగిరేది గులాబీ జెండేనని, మెతుకు గడ్డ గులాబీ అడ్డా అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని మల్లేపల్లిలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో నాయకులు, కార్యకర్తలందరూ సమిష్టిగా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు మెదక్ గడ్డపై గులాబీ జెండా ఎగురుతుందని, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కేసీఆర్ నిలబెట్టిన బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి ఆయనకు కానుకగా ఇవ్వాలన్నారు. ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. 20 రోజులు కష్టపడి పని చేయాలని, గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను ప్రజలకు తెలుపాలని హరీశ్‌రావు కార్యకర్తలకు సూచించారు. గెలిచిన 100 రోజుల్లో అన్ని గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి సీఎం పీఠంపై కూర్చున్నారన్నారు. హామీలు అమలుచేయడం చేతకాకపోతే దిగిపోవాలన్నా రు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఆరోగ్యశాఖ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌రావుదేశ్‌పాండే, డీసీసీబీ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం, డాక్టర్ శ్రీహరి, జడ్పీటీసీ పద్మావతీపాండురంగం, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు మ్యాకం విఠల్, బీఆర్‌ఎస్ నాయకులు సత్యనందం, మల్లాగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీది చిల్లర రాజకీయం

నర్సాపూర్ , ఏప్రిల్ 22: బీజేపీ సోషల్ మీడియాలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిపై గ్లోబల్ ప్రచారం చేస్తూ చిల్లర రాజకీయం చేస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సోమవారం నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి మాట్లాడుతూ.. నర్సాపూర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లోనే బీఆర్‌ఎస్ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల్లో మార్పు మొదలైందని, రైతుల్లో, కార్మికుల్లో, ఉద్యోగుల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత ఉందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బ్యాక్‌గ్రౌండ్ తెలుసుకొని ఓటేయ్యాలని, భూకబ్జాలకు పాల్పడ్డది ప్రజలందరికీ తెలుసన్నారు. బీజేపీ సోషల్ మీడియాలో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిపై దుష్పచారం చేస్తుందని, దీనిని ప్రజలు నమ్మవద్దని సూచించారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మంచి చేస్తే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేవాడని దుబ్బాకను అభివృద్ధి చేయకనే ప్రజలు బుద్ధి చెప్పారని వెల్లడించారు. నియోజకవర్గంలో హల్దీ వాగులోకి నీరు ఎక్కడి నుంటి వస్తుందో గ్రహించాలని, కేసీఆర్, వెంకట్రామిరెడ్డి కృషి వల్లనే ఇది సాధ్యమైందని వెల్లడించారు. చాలా జిల్లాల్లో పంటలు ఎండిపోయాయని మెదక్‌లో మాత్రం ఎండిన పంటల శాతం తక్కువగానే ఉందన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణ వడ్లను కొనలేదు, నేడు ఏ మొఖం పెట్టుకొని నామినేషన్ కార్యక్రమానికి వస్తున్నాడని మండిపడ్డారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, లేబర్ వెల్ఫేర్ బోర్డ్ మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, మాజీ ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సత్యంగౌడ్, సింగాయిపల్లి గోపి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

కరెంట్ లేక..ఎండిన వరి పంట

- పరిశీలించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్

రామంతాపూర్ తండాలో ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, నాయకులు

వెల్దుర్తి, ఏప్రిల్ 22: వ్యవసాయానికి విద్యుత్ సరిగ్గా రాకపోవడంతో చేతికి వచ్చే పంటలు ఎండిపోతున్నాయని, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మాసాయిపేట మండలంలోని రామంతాపూర్ తండాకు వచ్చిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి దృష్టికి పంట ఎండిపోయిన విషయాన్ని తీసుకెళ్లగా ఆమె ఎండిన రెండు ఎకరాల వరి పంటను పరిశీలించి, రైతు చవాన్‌కల్యాను ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులంటే పట్టింపులేదని, వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు పంటలు ఎండిపోయి మరోవైపు ధాన్యం కొనుగోళ్లు లేక అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి, మంత్రు లు ఇతర పార్టీల నాయకులను చేర్చుకుంటూ, ప్రచారాలు చేస్తూ బిజీబిజీగా గడుపుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట శివ్వంపేట ఎంపీపీ హరికృష్ణ, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, శ్రీనునాయక్, మోహన్‌రెడ్డిలతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

చికెన్ సెంటర్ యజమాని దారుణ హత్య

మహిపాల్‌రెడ్డి(ఫైల్)

జగదేవ్‌పూర్‌లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

- ఘటనా స్థలాన్ని క్లూస్‌టీంతో పరిశీలించిన పోలీసులు
- సెంటర్‌లో పనిచేసే బీహార్ యువకులే హత్య చేశారని కుటుంబీకుల ఆరోపణ
- పరారీలో నిందితులు
- సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో ఘటన

జగదేవ్‌పూర్ ఏప్రిల్ 22: చికెన్ సెంటర్ నడుపుతున్న వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం ఉమ్మడి తూప్రా న్ మండలం వెంకటాపూర్ పీటీ గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డి (40) మండలకేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఉంటూ షెట్టర్ అద్దెకు తీసుకొని ఏడాదిన్నరగా చికెన్ సెంటర్ నడుపుతున్నాడు. సెంటర్‌లో పనిచేయడానికి బీహార్‌కు చెందిన యువకులు కురాబల్, రూబల్‌లను 30 రోజుల క్రితం పనిలో చేర్చుకున్నాడు. మృతుడు మహిపాల్‌రెడ్డి సాయంత్రం 4గంటల వరకు రాకపోయే సరికి భార్య మానస ఫోన్ చేసి త్వరగా రావాలని గుర్తు చేయగా చికెన్ ఆర్డర్ ఉంది పంపించి వస్తానని చెప్పాడని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు, రాత్రి 9గంటలకు మృతుడి సోదరుడు శ్రీపాల్‌రెడ్డి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో సెంటర్‌లో పని చేసే కురాబల్, రూబల్‌లకు ఫోన్ చేస్తే వారి ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చిందన్నారు. పక్కన దుకాణాదారులకు ఫోన్ చేస్తే షాపు బంద్ చేసి ఉందని తెలిపారన్నారు. సోమవారం ఉదయం కుటుంబీకులు జగదేవ్‌పూర్‌కొచ్చి షెట్టర్ తెరిచి మహిపాల్‌రెడ్డి హత్య చేయబడి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న గజ్వేల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐ చంద్రమోహన్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలించగా కాళ్లు, చేతులు వైర్లతో కట్టేసి నోట్లో గుడ్డలు కుక్కి దాడి చేసి చంపినట్లు గుర్తించారు. దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలు హార్డ్ డిస్కు ధ్వంసం చేసినట్లు గుర్తించారు. వాటితోపాటు మద్యం బాటిళ్లు కాలిన సిగరెట్లు కనిపంచాయన్నారు. క్లూస్‌టీంతో క్షుణ్ణంగా పరిశీలించడంతోపాటు అందులో పని చేసే యువకులు పరారీలో ఉండటంతో వారే హత్య చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. కటుంబీకులు ఇచ్చన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఐదోరోజు తొమ్మిది సెట్ల నామినేషన్లు

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి జహీరాబాద్ నియోజకవర్గ స్థానానికి సోమవారం ఏడుగురు అభ్యర్థులు తొమ్మిది సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థిగా బీబీపాటిల్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా టీపీఎస్ అభ్యర్థి కొత్త బలిజ బస్వరాజ్ రెండుసెట్ల నామినేషన్ దాఖలు చేశారు. పిరమిడ్ పార్టీ ఇండియా అభ్యర్థిగా మాలపు మోహన్‌రెడ్డి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులు గంగారామ్ ఒక సెట్, రమేశ్ సజ్జపూర్ ఒక సెట్, మహదేవ్ స్వామి రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. జాతీయ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేశ్ శెట్కార్ తరపున మనీశ్‌కుమార్ పాటిల్ ఒకసెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి మాట్లాడుతూ పోటీ చేస్తున్న అభ్యర్థులకు సంబంధించిన ఆస్తులు, అప్పులు, నేర చరిత్ర వివరాలను ఎప్పటికప్పుడు సంగారెడ్డి రిటర్నింగ్ అధికారి నోటీసు బోర్డుపై ఉంచడంతోపాటు ఎన్నికల కమిషన్ అధికారి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని చెప్పారు.

కాంగ్రెస్‌వి హత్యారాజకీయాలు

- మీ దమ్ము చూపండి.. ఏమైనా మేము చూసుకుంటాం...
- మెదక్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో జగ్గారెడ్డి కామెంట్స్‌పై దుమారం
- మరుసటి రోజే సిర్గాపూర్ మండలంలో బీఆర్‌ఎస్ కార్యకర్త హత్య
- బీఆర్‌ఎస్ ప్రజాదరణ చూసి ఓర్వలేక దాడులకు దిగుతున్న కాంగ్రెస్
- పదువులు ఇస్తాం...కాంట్రాక్టులు ఇస్తాం అని కాంగ్రెస్ తాయిలాలు
- కాంగ్రెస్‌లోకి వస్తే అన్నీ చూసుకుంటాం.. పార్టీ పెద్దల ఎర
- పార్టీలోకి రాని వారికి బెదిరింపులు, కేసులు

సిద్దిపేట, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): '' మీ దమ్ము చూపండి. దేనికైనా మేము ఉన్నాం. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి చూసుకుంటాడు. ప్రభుత్వం మనది. పోలీసులకు భయపడకండి అంటూ మెదక్ కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు సమక్షంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాట్ కామెంట్స్ చేశారు'' ఈ వ్యాఖ్యలు ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్నాయి. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యమంత్రి సమక్షంలోనే ఈ కామెంట్స్ చేయడం...దానికి పైగా జగ్గారెడ్డి మీసాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మేలేయడం ..ఇవన్నీ చూస్తే శాంతి భద్రతలు పరిస్థితి ఏంటి...? శాంతి భద్రతలను కాపాడాల్సిన పెద్దలే ఇలాంటి వ్యాఖ్యలను ప్రోత్సహించడం ఎంత వరకు కరెక్టు అంటూ ఉమ్మడి జిల్లా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యాఖ్యలు చేసిన కొన్ని గంటల్లోనే కాంగ్రెస్ పార్టీ నేతలు సిర్గాపూర్ మండలంలో బీఆర్‌ఎస్ కార్యకర్తపై దాడి చేసి హతమార్చారు. మొన్నటి శాసనసభ ఎన్నికల ముందు సైతం దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి(ప్రస్తుత ఎమ్మెల్యే) కొత్త ప్రభాకర్ రెడ్డిపై ఓ యువకుడు (కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరుడు) కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తెలిసిందే. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొడుతున్నారు. నాయకుల మాటలకు పార్టీ కార్యకర్తలు రెచ్చిపోయి గ్రామాల్లో భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలను అన్ని వర్గాల ప్రజలు ముక్త కంఠంతో ఖండిస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో పోరాటం చేయాలి కానీ ఇలాంటి రెచ్చగొట్టే మాటలు మంచిది కావని కాంగ్రెస్ పార్టీ నాయకులకు మెతుకు సీమ గడ్డ హితవు చెబుతోంది.''

దౌర్జన్యానికి దిగుతున్న కాంగ్రెస్ పెద్దలు

ఇటీవల మెదక్ పట్టణంలో నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సమక్షంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు విస్మయాన్ని కలిగిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున పోలీసులకు భయపడవద్దని పార్టీ కార్యకర్తలకు చెప్పారు. మీ దమ్ము చూపండి ఏమైనా చూసుకుంటానని మాట్లాడారు. జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలను వివిధ వర్గాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అర్థ, అంగ బలాన్ని ఉపయోగించి బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలపై దాడులకు దిగుతుంది. జగ్గారెడ్డి మాట్లాడిన మరుక్షణమే నారాయణ్ ఖేడ్ నియోజకవర్గంలోని సిర్గాపూర్ మండలంలోని సిగార్‌బొగుడ తండాలోబీఆర్‌ఎస్ కార్యకర్త శ్రీనునాయక్‌పై కాంగ్రెస్ నాయకులు దాడులకు దిగారు. పంచాయతీకి పిలిచి రాళ్లు, కర్రలతో కొట్టి హత్య చేశారు. మెదక్ నియోజకవర్గ కేంద్రంలో ఇటీవల బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతలు దాడులకు దిగారు. ఇలా పలుచోట్ల కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారు. వీటిని అరికట్టాల్సిన పోలీస్ యంత్రాంగం నిమ్మకునిరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇటీవల కేసీఆర్ సభకు సైతం ఏమాత్రం సహకరించలేదు. ఆ సభలో పోలీసుల తీరును ఎండగట్టినప్పుడు ప్రజలు కేరింతలు కొట్టారు. అంటే పోలీసులపై ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎవ్వరికి కూడా హానిచేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే చిల్లర రాజకీయాలు చేస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మెదక్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలిచే పరిస్థితి లేదు. దీంతో ఎంతకైనా దిగజారి అల్లర్లు సృష్టించి గెలుపొందాలని కుటీల రాజకీయాలకు పాల్పడుతున్నది. పైగా ఆ పార్టీలో ఉన్న అంతర్గత కుమ్ములాటలు సైతం ఆ పార్టీపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని మొదటి నుంచి పనిచేస్తున్న క్యాడర్‌ను లెక్క చేయడం లేదన్న అసంతృప్తి పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉంది. ఇన్నాళ్లు జెండా మోసిన మమ్మల్ని కాదని కొత్తగా వచ్చిన నేతలకు పెత్తనం అప్పగించడంపై పాత కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రుగా ఉన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్త , మృతుడు శ్రీనునాయక్(ఫైల్)

కాంగ్రెస్ తాయిలాలు..

పార్టీలోకి వస్తే పదవులు ఇస్తాం...కాంట్రాక్టులు ఇస్తాం..మరెన్నో అవకాశాలు ఉంటాయి అంటూ... కాంగ్రెస్ తాయిలాలకు తెరతీసింది. ఇతర పార్టీల నేతలను, కార్యకర్తలను పార్టీలోకి చేర్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఎర వేస్తున్నారు. వారం రోజులుగా ఉమ్మడి జిల్లాలోని సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఇతర పార్టీల నేతలను కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడానికి ఆ పార్టీ పెద్దలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ప్రధానంగా బీఆర్‌ఎస్ నాయకులపై కన్నేసి వారిని కాంగ్రెస్‌లోకి తీసుకోవడానికి ఎంతకైనా దిగజారుతున్నారు. కాంగ్రెస్ ఇచ్చే తాయిలాలకు లొంగని వారి ఆస్తుల మీద దాడులకు దిగుతున్నారు. అవసరమైతే బెదిరింపులకు సైతం పాల్పడుతున్నారు. ఎలాగైన వారిని పార్టీ వైపు మలుపు కోవాలన్నదే కాంగ్రెస్ పెద్దల ఆలోచన. ఇటీవల సంగారెడ్డి జిల్లాలోని సుల్తాన్‌పూర్‌లో నిర్వహించిన కేసీఆర్ సభకు భారీ స్పందన రావడంతో కాంగ్రెస్ పార్టీలో వణుకు పుట్టింది. రోజురోజుకూ బీఆర్‌ఎస్‌కు వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. మెదక్ లోకసభ పరిధిలోని ఏడు శాసనసభ స్థానాల్లో బీఆర్‌ఎస్ పటిష్టంగా ఉంది. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, నర్సాపూర్, పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. మెదక్‌లో మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఉన్నప్పటికీ అక్కడ ఆయనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. దీంతో ఏడు శాసనసభ స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు గ్రామాల్లో, పట్టణాల్లో మంచి ఆదరణ వస్తుంది. ఇప్పటికే మండలస్థాయిలో బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశాలు నిర్వహించి పార్టీ శ్రేణులను సమాయత్తం చేసి కార్యరంగంలోకి దించింది. దీంతో పార్టీ క్యాడర్ చురుగ్గా గ్రామాల్లో విస్తత ప్రచారం చేస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో జహీరాబాద్, అందోల్, నారాయణ్‌ఖేడ్, కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, కామారెడ్డి శాసనసభ నియోజక వర్గాలు వస్తాయి. మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లో జహీరాబాద్ నియోజకవర్గంలోని జుక్కల్, ఎల్లారెడ్డి, అందోల్, నారాయణ్‌ఖేడ్ లలో (కాంగ్రెస్), కామారెడ్డి(బీజేపీ), బాన్సువాడ, జహీరాబాద్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. గత శాసనసభ ఎన్నికలకు ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు చూస్తే అంతటా బీఆర్‌ఎస్ గాలివీస్తుంది. రైతులకు రుణమాఫీ చేయకపోవడం, రైతుబంధు, పంటలకు బోనస్, పింఛన్ తదితర పథకాలను అమలు చేయకపోవడంతో అధికార కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఇటీవల సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. వారి నోట కేసీఆర్ కావాలి అంటూ నినదించారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో అలజడి మొదలైంది. ఎలాగైనా బీఆర్‌ఎస్‌ను దెబ్బకొట్టాలని కుటిల ప్రయత్నాలకు పాల్పడుతుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు విజయం వైపు దూసుకెళ్తుండడంతో కాంగ్రెస్‌కు ఏం చేయాలో పాలుపోవడంలేదు.

కార్యకర్తలే మా బలం..బలగం

- వెంకట్రామిరెడ్డిని కష్టపడి గెలిపించుకుందాం
- కాంగ్రెస్, బీజేపీలపై ప్రజల్లో వ్యతిరేకత
- బీఆర్‌ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష
- ఇరవై రోజుల కష్టంతో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం
- సన్నాహక సమావేశంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, సమావేశానికి హాజరైన పార్టీ కార్యకర్తలు

పటాన్‌చెరు, ఏప్రిల్ 22: బీఆర్‌ఎస్ కార్యకర్తలే మా బలం..బలగమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ మెదక్ పార్లమెంట్, పటాన్‌చెరు డివిజన్, మండలం సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాటాడారు. పార్లమెంట్ ఎన్నికలు బీఆర్‌ఎస్‌కు కీలకం అన్నారు. తెలంగాణ హక్కులపై రాజీలేకుండా పోరాడే పార్టీ బీఆర్‌ఎస్ మాత్రమే అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్ర ప్రయోజనాలను ఇతర రాష్ట్రాలకు తాకట్టుపెడతాయన్నారు. కాంగ్రెస్ నాలుగు నెలల పాలనపై ప్రజల్లో నిరుత్సాహం పెరిగిందన్నారు. బీజేపీ మతతత్వ పరిపాలనతో ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ మోసపూరత వాగ్దానాలు చేసి ప్రజలను నిండా ముంచిందన్నారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు తిరిగి గుర్తిస్తున్నారన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. బూత్ లెవల్ నుంచి పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. బీఆర్‌ఎస్ మూడుసార్లు పటాన్‌చెరులో గెలిచిందని, అదంతా కార్యకర్తల కష్టమేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పుడు కష్టపడిన వారిని గుర్తిస్తామన్నారు. నాయకులు ధైర్యంగా ముందుండి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు. అభ్యర్థి వెంకట్రామిరెడ్డి రూ.100కోట్లతో సేవా కార్యక్రమాలు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కులం, మతం పేరున ఎవరు మోసపోవద్దన్నారు. బీఆర్‌ఎస్ అందరినీ సమానంగా చూసిందన్నారు. ప్రతి బూత్ నుంచి మెరుగైన ఫలితాలు రావాలని మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ అన్నారు. బూత్ లెవల్‌లో ఓటర్లను కలిసి కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. వెంకట్రామిరెడ్డి వంటి ఐఏఎస్‌ను చట్టసభల్లోకి పంపిస్తే మన మెతుకు సీమ కష్టాలు వివరించి నిధులు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఎంపీపీ సుష్మాశ్రీవేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ సుప్రజావెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, మాజీ ఎంపీపీలు శ్రీశైలంయాదవ్, యాదగిరియాదవ్, ఆత్మకమిటీ చైర్మన్ గడీల కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు పాండు, డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, మెరాజ్‌ఖాన్, గూడెం మధుసూదన్‌రెడ్డి, యాదమ్మ, మాజీ సర్పంచ్‌లు లక్ష్మయ్య, సుధీర్‌రెడ్డి, అంతిరెడ్డి పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచలోని కొనుగోలు కేంద్రంలో నీట మునిగిన ధాన్యం రాశులు (ఫైల్)

కష్టాల్లో అన్నదాతలు

- ఓ వైపు కరువు, మరోవైపు అకాల వర్షాలు
- రాష్ట్ర ప్రభుత్వ తీరుతో అసహనం
- సిద్దిపేట జిల్లాలో 15 మంది రైతుల మృతి

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 22 : ఓ వైపు కరువు, మరో వైపు అకాల వర్షాలతో అన్నదాతలు ఆగమవుతున్నారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న రైతులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రైతులు గోస పడుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో రైతులు అసహనానికి గురవుతున్నారు. ఒక వైపు సాగునీరు అందక పంటలు ఎండుతుంటే.. మరో వైపు అకాల వర్షాలతో నష్టపోవడమే కాకుండాకొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం పూర్తిగా తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో తెచ్చిన అప్పులు కట్టలేక రైతులు అరిగోస పడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా వివిధ కారణాలతో సుమారు 15 మంది రైతులు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో కొంతమంది రైతులు ఆత్మహత్య చేసుకుంటే మరికొంత మంది కరెంట్ షాక్, ఇతర కారణాలతో మరణించారు.

పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను అన్ని రకాలుగా ఆదుకుంది. 24 గంటల నాణ్యమైన కరెంట్, సకాలంలో రైతుబంధు, రైతుబీమా, సకాలంలో ఎరువులు అందజేయడంతోపాటు ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతిగింజనూ కొనుగోలు చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. వరి కోతలు ప్రారంభమై కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చి 20 రోజులు గడుస్తున్నా ఇంకా ధాన్యం కొనుగోలు చేయడంలేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రాగానే ఎకరాకు రూ.15 వేలు రైతు బంధు ఇస్తామని, రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని, అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి.. ఇపుడు ఆ ఊసే ఎత్తకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి సిద్దిపేట జిల్లాలో 603 మంది రైతులకు రూ.30.15 కోట్ల రైతుబీమా రైతుల ఖాతాలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. వివిధ కారణాల వల్ల ఇంకా కొంత మందికి రైతుబీమా అందలేదని అధికారులు తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపు మేరకు ఇప్పటికే రైతులు పోస్ట్ కార్డు ఉద్యమం పేరిట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు రాస్తున్నారు. సిద్దిపేట స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా పోస్ట్ కార్డు ఉద్యమం కొనసాగుతున్నది.

జిల్లాలో నీళ్లు లేక ఎండిన పొలం (ఫైల్)